సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 15 । జనవరి । 2024

I



బీరువా ఎత్తుకెళ్లిపోయారు

తిమడాం గ్రామంలో భారీ చోరీ జరిగింది. ఏకంగా బీరువానే ఎత్తుకెళ్లిపోయారు.

- IIలో



అందరికీ అయోధ్య అక్షతలు

అయోధ్య అక్షతలు అందరికీ పంపిణీ చేస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా పంపిణీ జరుగుతోంది.

- IIలో

గోశాలకు 42 పశువుల తరలింపు

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై కుశాలపురం సమీపంలో అక్రమంగా 42 పశువులను తరలిస్తున్న వాహనాలను శనివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనాలు సీజ్ చేసి, పశువులను గోశాలలకు తరలించినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. జాతీయ రహదారిపై నిరంతరం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

21న అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: అండర్-12 క్రికెట్ జట్టు ఎంపికలు ఈ నెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష,కార్యదర్శులు వైఎస్ శాస్త్రి, షేక్ హసన్ రాజా తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ(ఆర్ట్స్) కళాశాల మైదానంలోని క్రికెట్ అసోసియేషన్ కార్యాలయం వద్దకు చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలసి రావాలని చెప్పారు. ఎంపికలకు హాజరయ్యే బాలురు వారి ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. ఈ ఎంపికల రోజు మెడికల్ సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుతున్నట్టు చెప్పారు. వివరాలకు జిల్లా క్రికెట్ సంఘం కోచ్ కె.సుదర్శన్, కొట్టిశ కిరణ్, జీఎస్ఎస్ ప్రసాద్ 8688146164ను సంప్రదించాలని సూచించారు.

రైతులకు సత్కారం



గోకర్ణపురం గ్రామంలో రైతులను సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: గోకర్ణపురం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం నియోజకవర్గంలోని పలువురు ఆదర్శ రైతులను దుశ్శాలువలతో సత్కరించి, సన్మానించారు. రైతులు పూడి హరినారాయణ, కప్ప గోపీనాథ్, ఉప్పాడ వాసుదేవరెడ్డి, అమర్ ఆలీ, కుశదేవ్ బెహరా, దున్న జానకిరావు, కడగల దుర్యోధన, సీర కామరాజు, రౌతు నిరోష, గొణప దాసప్పలు సత్కారం అందుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ప్రధాన శివాజీ, డాక్టర్ యారడి కృష్ణమూర్తి, పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ కె.అప్పలస్వామి, వ్యవసాయాధికారులు బి.నరసింహమూర్తి, బి. ధనుంజయరావు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఎం జిల్లా శాఖ ఏర్పాటు

కాశీబుగ్గ: మానవ హక్కుల మిషన్ శ్రీకాకుళం జిల్లా శాఖకు పలాస నియోజకవర్గానికి చెందిన ఈశ్వర్ పాత్రో ప్రతినిధిగా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా మల్లేన దేవరాజు, జిల్లా వెల్ఫేర్ సెక్రటరీగా హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్‌నాయక్‌లు నియమాకమయ్యారు. కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో ఆదివారం కాశీబుగ్గ డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. రెండేళ్ల పాటు ఈ పదవీకాలం ఉంటుందని హ్యూమన్ రైట్స్ మిషన్ రాష్ట్ర అధ్యక్షులు షైక్ భాషా, జాతీయ ఉపాధ్యక్షులు ఎస్‌జికుమార్ ప్రముఖ జానపద గాయకులు నక్క వాసు నియమాక పత్రంలో పేర్కొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేదోడు



మోహినికి నగదు అందిస్తున్న కృష్ణ స్నేహితులు

జలుమూరు: తమతో కలిసి చదువుకున్న స్నేహితుడికి కష్టం వస్తే.. తోటివాళ్లంతా కలిసి ఆదుకున్నారు. నగిరికటం పంచాయతీ పరిధి మెట్టుపేటకు చెందిన ఊట కృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమయ్యాడు. దీనికి తోడు కృష్ణ తండ్రి శిమ్మన్న దివ్యాంగుడు, ఆపైన తల్లి కూడా మృతి చెందింది. ఈ నేపథ్యంలో కృష్ణ భార్య మోహినిపైనే కుటుంబ భారమంతా పడింది. కృష్ణ పూర్తిగా కోలుకునేందుకు అధిక మొత్తం డబ్బుతోపాటు సుమారు ఏడాది సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న శ్రీముఖలింగం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, కృష్ణ స్నేహితులు విరాళాలు సేకరించి మోహినికి రూ.75వేలు అందజేశారు.

రెండు వర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : గడ్డి ట్రాక్టర్ బైక్‌కు తగిలిన ఘటనలో రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. దీంతో ఆ రెండు వర్గాలపై కేసు నమోదు చేశామని ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్ పేర్కొన్నారు. నగరంలోని హయాతి నగరానికి చెందిన దుక్క శ్రీనివాసరావు గేదెల పాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. గేదెల మేత కోసం ట్రాక్టర్‌తో గడ్డి లోడు తెప్పించారు. అది అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా శెగిడివీధి రామమందిరం వద్ద శెగెళ్ల కూర్మమణి, జిలేల్‌ల వెస్పా స్కూటర్‌కు ట్రాక్టర్ తగిలింది. దీంతో శ్రీనివాసరావు, అతని కుమారుడు గంగరాజులను కూర్మమణి, జిలేల్‌లు ప్రశ్నించగా వాగ్వాదం మొదలై అది కాస్తా కొట్లాటకు దారితీసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

పండుగ.. గుండె నిండుగా

పండగ పూట ఇంటికి వచ్చిన కూతురిలా.. ధాన్యలక్ష్మి అన్నదాత గాదెను చేరుకుంది. ఎన్నో రోజుల తర్వాత మనవళ్లను చూసిన అమ్మమ్మలా.. పల్లెతల్లి సొంత బిడ్డలను చూసి పరవశించింది. చంటి దాని బోసి నవ్వులా.. ఇంటి వాకిట రంగవల్లి మెరిసిపోయింది. వీధివీధినా ఎగసిన భోగి మంటలు సంక్రాంతి ఆగమనాన్ని చాటి చెప్పగా... ఊరి చివర ఎగిరిన గాలి పటాలు సంబరాల సమయం ఇంకా మిగిలే ఉందని గుర్తు చేశాయి. కొత్త దుస్తుల మిలమిలలు, పిండి వంటల ఘుమఘుమలు, బంధు మిత్రుల పలకరింపులు, కొత్త అల్లుళ్ల మర్యాదలు.. కలగలిపి మరో రెండు రోజులు ఊరూవాడా వేడుక చేసుకుంటాయి.



సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో భోగీ వేడుక



ఎల్.ఎన్.పేట: వాడవలస గ్రామంలో లక్ష పిడకలతో భోగి మంట



హిరమండలం: 180 అడుగుల పిడకల దండను మోసుకొస్తున్న పిల్లలు

● సంక్రాంతి వచ్చిందే తుమ్మెదా..

సంక్రాంతి సందర్భంగా గాజులకొల్లివలస సమీపంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఆదివారం ఇసుకతో చక్కటి శిల్పాన్ని తీర్చిదిద్దారు. దీన్ని చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు.

-ఆమదాలవలస రూరల్



● అరసవల్లిలో తొలిసారి..

ప్రసిద్ధ ఆదిత్య క్షేత్రంలో ఆదివారం సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. వేకువజామునే భోగి పండుగ సందర్భంగా ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో అర్చక బృందం వేదమంత్రోచ్ఛరణల నడుమ భోగి మంటల్లో పిడకల దండలు వేసి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. తొలిసారిగా అరసవల్లి క్షేత్రంలో సంక్రాంతి సంబరాలను ప్రారంభించామని, ఇకపై ఏటా నిర్వహించేలా చర్యలు చేపడతామని ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ తెలియజేశారు.

-అరసవల్లి



సిరిసంపదలు కలగాలి



సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటా సిరి సంపదలు కలగాలి. భగవంతుని ఆశీస్సులు అందరిపై ఎల్లవేళలా ఉండాలి. వైఎస్ జగన్ నాయకత్వాన సుభిక్ష పాలనను కొనసాగించాలి.

– తమ్మినేని సీతారాం, స్పీకర్

ఇంటింటా సంబరాలు



ప్రతి ఇంటిలో సంక్రాంతి సంబరాలు వెల్లివిరియాలి. జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలి. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు.

– ధర్మాన ప్రసాదరావు, రెవెన్యూ మంత్రి

పుడమి తల్లికి సీమంతం




ధాన్యంను పుడమి తల్లి గర్భాన దాచేందుకు పాతర తీస్తున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్: ఆరుగాలం కష్టపడి, చంటిపాపను కాపాడినట్టు పైరును కంటికి రెప్పలా కాపాడి, ప్రకృతి వైపరీత్యాలకు ఎదురొడ్డి.. అన్నదాత పండించిన పంట ఎట్టకేలకు అతని ఇంటికి చేరే వేళయ్యింది. ధాన్యలక్ష్మికి పొలంలో పూజలు చేసి ఇంటికి తెచ్చే సందడి సంక్రాంతి నాడు పల్లెపల్లెనా కనిపిస్తుంది. ఉద్దానం పల్లెలో అయితే ఆ ధాన్యాన్ని పాతర వేసే సంప్రదాయం ఇంకా నడుస్తోంది. ఇంటి అరుగు ముందు గొయ్యి తవ్వి, అందులో గడ్డి వేసి అక్కడే ధాన్యలక్ష్మిని భద్రపరచడం అనాదిగా వస్తున్న పద్ధతి. వానలు, వరదలు, అగ్ని ప్రమాదాల బారి నుంచి రక్షించడానికి ఈ విధానాన్ని ఇప్పటికీ అక్కడ అవలంబిస్తున్నారు. అరుగు అరుగునా కనిపించే పాతరలను చూస్తే పుడమి తల్లికి సీమంతం జరిగినట్టు కనిపిస్తుంది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి ప్రాంతాల్లోని రైతులతో పాటు ఒడిశా ప్రాంతంలోని రైతులకు మిద్దెలు, గాదెలు, గిడ్డంగులు ఉన్నప్పటికీ సంక్రాంతికి ఇంటికి వచ్చిన ధాన్యలక్ష్మిని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి పుడమి గర్భాన దాచుకోవడం సంప్రదాయం. వర్షాకాలం సమయాల్లో పాతరలో ముక్కిన ధాన్యంను తీసి ఆహారంగా వినియోగించడం ద్వారా బలవర్థకంగా ఉంటుందని ఈ ప్రాంతీయుల నమ్మకం.



నేస్తరికానికి చెక్కీ

సంక్రాంతి అనగానే ఉత్కళాంధ్రులకు ఠక్కున గుర్తుకు వచ్చేది మువ్వ చెక్కీ. నెయ్యి, పంచదార, ఎండు కొబ్బరి ముక్కలు, జీడిపప్పుతో కలిపి చేసే వంటకం ఇది. నూతన సంవత్సరం నుంచి కనుమ పండుగ వరకు స్నేహితులకు, బంధువులకు, యజమానులకు, కొత్త అల్లుళ్లకు, సోదరులకు ఈ మువ్వ చెక్కీని కానుకగా అందజేస్తారు. ఒడిశా రాష్ట్రం బరంపురం చెక్కీలకు మంచి గిరాకీ ఉంది. ప్రస్తుతం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఈ మువ్వ చెక్కీలు దుకాణాల్లో లభిస్తున్నాయి.



మార్కెట్‌లోకి మువ్వ చెక్కీలు

● కమనీయం.. కల్యాణం



గోదాదేవి, రంగనాథుల కల్యాణం జరిపిస్తున్న దృశ్యం

మందస: పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో గోదారంగనాథుల కల్యాణ క్రతువు ఆదివారం కమనీయంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు వధూవరుల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. ఈ సందర్భంగా శాంతి, సుభిక్షం చేకూరాలని హోమం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

నేటి నుంచి గ్రామాల్లో జాతరలు

జి.సిగడాం: సంక్రాంతి నేపథ్యంలో గ్రామాల్లో జాతర్ల సందడి నెలకుంది. మెట్టవలసలోని ఏకశిలా పర్వతంపై వెలసియున్న మల్లికార్జున స్వామి యాత్ర మహోత్సవాలు సోమవారం నుంచి మూడు రోజులపాట జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను గ్రామ పెద్దలు ఏర్పాటు చేశారు. అలాగే గెద్దకంచరాం గ్రామంలో ఈనెల 16 తేదీ నుంచి పైడితల్లిమ్మవారి యాత్ర మహోత్సవాలు జరుగుతాయి. ఏటా కనుమ రోజు నుంచి మూడు రోజులు ఉత్సవం జరుగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే మధుపాం గ్రామంలోని దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 19వతేదీ వరకు జరుగుతాయి. జాతర్ల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



గెద్దకంచరాంలోని పైడి తల్లి అమ్మవారి విగ్రహం



మధుపాంలోని దుర్గాదేవి విగ్రహం

21న జిల్లాస్థాయి క్రికెట్ అంపైర్లు, స్కోరర్ల ఎంపిక



శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో నిర్వహించనున్న పలు క్రికెట్ టోర్నమెంట్‌లకు అవసరమయ్యే జిల్లా స్థాయి అంపైర్లు, స్కోరర్ల కోసం ఈనెల 21వ తేదీన ఎంపిక పరీక్షలను నిర్వహించనున్నట్టు జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శి వైఎస్ శాస్త్రి, హసన్ రాజా తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 25 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన పురుషులు/మహిళలు అర్హులని పేర్కొన్నారు. క్రికెట్‌పై అవగాహన, పరిజ్ఞానం కలిగి వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ల కోసం నిర్వహించే క్వాలిఫైయింగ్ టెస్టులకు కూడా పంపిస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 21వ తేదీన శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు హాజరు కావాలని వారు కోరారు.

పాఠశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు



గర్వంగా నిలబడి..

శ్రీకాకుళం: సంక్రాంతి సందర్భంగా ఎక్కడెక్కడి నుంచో సొంతూళ్లకు వస్తున్న వారు తాము చదువుకున్న బడుల్లో కనిపిస్తున్న మార్పులు గమనించి అబ్బురపడుతున్నారు. శ్రీకాకుళంలోని అంధవరపు వరహానరసింహం మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో 1988 నుంచి 2013 వరకు చదువుకున్న వారు ఆదివారం బడిని పరిశీలించారు. వాళ్లు చదువుతున్న తరగతి గదులు, పాఠశాలలో మార్పులు చూసి.. 'ఇది మనం చదివిన పాఠశాలేనా..?' అని ప్రశ్నించుకున్నారు. నాడు-నేడు పథకంలో ఈ ప్రభుత్వం చేపట్టిన మార్పులను పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి తరగతి గదినీ డిజిటల్ క్లాస్ రూమ్‌గా మార్చడంతో పాటు ఐఎఫ్‌పీ ప్యానల్ ఏర్పాటు, కంప్యూటర్ ల్యాబ్, లేబరేటరీ, అధునాతన మరుగుదొడ్లు, హ్యాండ్‌వాష్, డ్రింకింగ్ వాటర్ వంటి సదుపాయాలు చూసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మల్ల శ్రీను, మళ్లా శ్రీనివాస్‌చక్రవర్తి, కిల్లంశెట్టి అరుణకుమార్‌గుప్త, నళినీకాంత్, పాట్నూరు శ్రీను, అందవరపు భాస్కరరావు, అట్ల వేణుకుమారి, అందవరపు నందికేశ్వరరావు, ఎడ్ల వెంకటరావు, హెచ్‌ం పి. ఇందిరామని తదితరులు పాల్గొన్నారు.

కొండనెక్కగలవా..

● నేటి నుంచి మూడు రోజుల పాటు సంగమయ్య జాతర


ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండల మధ్య అతిపెద్ద కొండపై సంగమేశ్వర ఆలయం సంబరానికి సిద్ధమైంది. ఈ కొండను సంగమయ్య కొండ అని, గోపకొండ అని కూడా పిలుస్తారు. ఇక్కడ జాతర ఆనవాళ్లు 12వ శతాబ్దం నుంచి ఉన్నాయని చెబుతుంటారు. జైనం, శైవం, బౌద్ధం కూడా ఇక్కడ విలసిల్లిందని ప్రతీతి. సంగమేశ్వర కొండ దిగువన గొల్లభామగా పిలిచే స్త్రీ దేవతా విగ్రహం ఉంటుంది. 164 మెట్లు ఎక్కి పైకి వెళితే కొండ నట్ట నడుమ భాగంలో 25 అడుగుల లోపలికి ఒక గుహ ఉంది. ఈ గుహలో ఆరు అడుగుల ఎత్తున్న పురుషాకృతి కలిగిన విగ్రహం, దానిముందు ఒక శివలింగం, నంది, దుర్గాదేవి, విఘ్నేశ్వర విగ్రహాలు ఉంటాయి. ఇవికాక ఆలయం మొదటిభాగంలో ప్రవేశం వద్ద నంది విగ్రహం, కుడి పక్కన బౌద్ధ విగ్రహం, ఎడమవైపున పెద్ద బుద్ధుని విగ్రహం కనిపిస్తాయి. ఈ కొండపై 150 ఏళ్ల క్రితం చిన్న దేవాలయం, 111 ఏళ్ల క్రితం మెట్ల నిర్మాణాలు జరిగాయని పెద్దలు చెబుతుంటారు. కొండ దిగువ నుంచి చూస్తే కొండ మెట్లు, దేవాలయం సర్పాకారం పోలి ఉంటాయి. ఆలయానికి చేరువలో పెద్ద మర్రి చెట్టు, వేప చెట్లు ఉన్నాయి.



కొండపై సంగమేశ్వర ఆలయానికి చేరుకునే మెట్లు

ఏటా సంక్రాంతి జాతరలు

సంగమయ్య కొండ వద్ద ఏటా సంక్రాంతికి జాతర చేయడం ఆనవాయితీ. సంక్రాంతి మొదలుకుని కనుమ, ముక్కనుమ రోజుల్లో మూడు రోజుల పాటు వైభవంగా జాతర జరుగుతుంది. రాష్ట్రంలో మొదటి జాతర అయినందున జిల్లా నుండే కాక ఇతర జిల్లాలు, పక్క ఒడిశా రాష్ట్రం నుండి చాలా మంది యాత్రికులు వస్తారు. ఈ జాతరకు సుమారు 2 లక్షల మంది హాజరవుతారు. సంగమేశ్వర కొండ పైభాగంలో ఉన్న ఆలయం ఎడమ పక్కన ఓ బావి ఉంటుంది. ఈ బావిలో దేవాలయానికి వచ్చే ప్రతి భక్తుడు కూడా చిల్లర డబ్బులు వేసి తమ మొక్కులు తీర్చుకుంటారు.



సంగమయ్య దర్శనానికి వెళ్లే గుహ

ఏపీఆర్‌టీపీపీ సంఘం ఉపాధ్యక్షునిగా కృష్ణచంద్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ టెన్యూర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షునిగా జిల్లాకు చెందిన న్యాయవాది, ఫ్యామిలీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ ఎంపికయ్యారు. గుంటూరులో ఈ నెల 12న రాష్ట్ర సంఘం ఎన్నికలు జరిగాయి. కృష్ణచంద్ నియామకంపై పలువురు న్యాయవాదులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు.

బీరువా ఎత్తుకెళ్లిపోయారు

- తిమడాంలో భారీ చోరీ
- 39 తులాలు బంగారం, 4 కేజీలు వెండి, నగదు రూ.50 వేలు అపహరణ


సంఘటన స్థలం వద్ద పరిశీలిస్తున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

జలుమూరు: తిమడాం గ్రామంలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఏకంగా బీరువాకు బీరువానే ఎత్తుకెళ్లిన వైనం స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. తిమడాం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బరాటం ప్రసాదరావు ఇంటిలో 39 తులాలు బంగారం, నాలుగు కేజీలు వెండి, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసాదరావు మామయ్య ఇటీవల సైరిగాం పంచాయతీ పరిధి లింగంనాయుడుపేటలో మృతి చెందారు. ఈ క్రమంలో ప్రసాదరావు తిమడాం నుంచి లింగనాయుడుపేట తరచూ వెళ్లి వస్తుండేవారు. ఈ నెల 2వ తేదీన ఆయన లింగంనాయుడుపేట నుంచి తిమడాం వచ్చారు. ఇల్లు శుభ్రం చేసి మళ్లీ లింగంనాయుడుపేట వెళ్లిపోయారు. భోగి పండుగ చేసుకుందామని ఆదివారం తిమడాం వచ్చి ఇంటి తాళాలు తీసి చూశారు. ఇంటిలో సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉండడం చూసి కంగారుపడ్డారు. ఇంటిలో ఉండాల్సి బీరువా కనిపించకపోవడం, ఇంటి వెనుక భాగం నుంచి చట్రాలకు అడ్డంగా ఉన్న రాడ్‌ను తొలగించడం చూసి నిశ్చేష్టులైపోయారు. ఆ బీరువాలో 39 తులాలు బంగారం, నాలుగు కేజీలు వెండి వస్తువులు, రూ.50 వేలు నగదు ఉన్నాయని ఆయన చెబుతున్నారు.


ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ పారినాయుడు, సిబ్బంది

దీంతో వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రా రెడ్డి, క్లూస్ టీమ్ సీఐ బూర ప్రసాదరావు, జలుమూరు ఎస్‌ఐ పి.పారినాయుడు, సిబ్బంది సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు మొదలుపెట్టారు. పరిసర ప్రాంతాలతో పాటు ఇంటికి సమీపంలో ఉన్న అన్ని ఇళ్లను పరిశీలించారు. బీరువాను ఇంటికి వెనుక ద్వారం నుంచి వంశధార కాలువ నుంచి తీసుకెళ్లారా.. ఏదైనా వాహనం ద్వారా తీసుకెళ్లారా అన్నది పరిశీలిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పారినాయుడు తెలిపారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా దొంగలను పట్టుకుంటామన్నారు.

మార్పు పద్మనాభంకు ఘనంగా నివాళి

మందస: సమాజంలో మార్పు కోసం పద్మనాభం తపించారని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని హరిపురంలో కమ్యూనిస్టు యోధుడు మార్పు పద్మనాభం 58వ వర్ధంతి ఆదివారం జరిగింది. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సామాజిక విముక్తి కోసం మార్పు పద్మనాభం అనుసరించిన మార్గమే అనుసరణీయమని పేర్కొన్నారు. సర్దార్ బిరుదు పొందిన ఏకైక నాయకుడని కొనియాడారు. తొలితరం కమ్యూనిస్టు వీరుడైన మార్పు ఆశయాలు నేటికీ నెరవేరలేదన్నారు.

ముందుగా కామ్రేడ్ మార్పు పద్మనాభం విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు తాండ్ర ప్రకాశ్, సన్నశెట్టి రాజశేఖర్, గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, జె.అప్పయ్య, బర్ల గోపి, పోతనపల్లి మల్లిబాబు, ఉగ్రిపల్లి సోమనాథం, కంసు కృష్ణమూర్తి, నల్ల హడ్డి, మామిడి మాధవరావు, దాసరి తాతారావు, పసుపురెడ్డి రాము, వి.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మార్పు పద్మనాభం విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

లక్షమందితో తూర్పుకాపు గర్జన

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఫిబ్రవరి నెల మొదటి వారంలో శ్రీకాకుళం నగరంలో లక్షమందితో తూర్పు కాపు గర్జన పేరుతో భారీ సదస్సు ఏర్పాటు చేస్తామని తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు సురంగి మోహనరావు, డోల జగన్, శాసపు జోగి నాయుడు, ఆనేపు రామకృష్ణ, లుకలాపు రవి, గేదెల శంకరరావు, లంక గాంధీ, లోలుగు వెంకట రాజశేఖర్, ఎం.శంకర్‌నారాయణలు తెలిపారు. వారు శ్రీకాకుళం నగరంలో తూర్పు కాపు భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఉద్యోగ పరంగా తూర్పు కాపు జాతి వెనుకబడి ఉందని అన్నారు. ఈ స్థితి నుంచి బయట పడాలంటే ఒక్క రాజకీయ అధికార సాధనే ముఖ్యమని భావించి ఈ గర్జన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలకు, వర్గ వైషమ్యాలకు అతీతంగా జరుగుతున్న ఈ సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారంతా హాజరు కావాలని వారు కోరారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంక్షేమ సంఘం ప్రతినిధులు కిల్లారి నారాయణరావు, కురిటి దుర్గారావు, దువ్వు కృష్ణారావు, టంకాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


నినదిస్తున్న సంఘ నాయకులు

20 బస్తాల ధాన్యం దగ్ధం

కాశీబుగ్గ: పలాస పెద్దవీధిలోని తెలుకల రాసమ్మకు చెందిన 20 బస్తాల ధాన్యం ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సీతమ్మగుడి సమీపంలో రాసమ్మకు చెందిన 2 ఎకరాల పొలం ఉంది. పండించిన ధాన్యాన్ని పొలంలో ఉంచగా ప్రమాదవశాత్తు అగ్గి అంటుకుని ధాన్యం బస్తాలు కాలిపోయాయి. స్థానికులు రాసమ్మకు సమాచారం అందించగా.. ఆమె వచ్చి చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. అనంతరం పలాస అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.30 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.


మిగిలిన ధాన్యం సేకరిస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఉల్లాసంగా క్రికెట్ మ్యాచ్


భద్రగిరి మురళీధర్‌కుమార్, ఎండీ సురేన్ హక్‌ను సత్కరిస్తున్న క్రికెట్ సంఘ ప్రతినిధులు హసన్‌రాజా, ఇలియాస్, శైలానీ, ప్రవీణ్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా క్రికెటర్లలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకే పాతతరం, కొత్తతరం క్రికెటర్ల కలయికతో ఏటా భోగి రోజున ఫ్రెండ్లీ మ్యాచ్ నిర్వహిస్తున్నామని జిల్లా క్రికెట్ సంఘ కార్యదర్శి షేక్ హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్) కళాశాల మైదానంలో ఆదివారం ఫ్రెండ్లీ మ్యాచ్‌ను నిర్వహించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు దివంగత క్రికెటర్లు డాక్టర్ జీవీ రాజారెడ్డి, మీర్ మహ్మద్, ఓరుగంటి కమలాకర్, బత్తుల రమణ, ఇషాక్ మహ్మద్, టీఎంఎస్ ప్రకాష్ అలియాస్ ముని తదితరులకు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. పాతతరం, కొత్తతరం క్రీడాకారులు పాల్గొన్నారు. సెక్రటరీ లెవన్, ప్రెసిడెంట్స్ లెవన్ రెండు జట్లుగా విభజించి 20 ఓవర్ల చొప్పున టీ-20 మ్యాచ్‌ను నిర్వహించారు. సెక్రటరీ లెవన్ గెలిపొందింది. ఈ మ్యాచ్‌లో జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ జాయింట్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్, వి.మధుసూదన్, సీనియర్ క్రికెటర్, మెంటర్ ఇలియాజ్ మహ్మద్, అండర్ -16 జట్టు కోచ్ మేఘనాథ్, కొట్టిశ కిరణ్, ఎంవీ రమణ, జిల్లా క్రికెట్ సంఘం యోగా కోచ్ బెండి సురేష్, సీనియర్ క్రికెటర్లు జీమా, బద్రిగిరి వసంత్, జీఎస్ ఎస్ ప్రసాద్, విజయభాస్కర్, ఆంధ్రా అసోసియేషన్ మాజీ కోచ్ కె.ఆదర్శ, వై.ఉమామహేశ్వరరావు, పొందూరు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ వై.ఉమామహేశ్వరరావు, సీనియర్ క్రికెటర్ బద్రగిరి మురళీధర్ కుమార్, జిల్లా అసోసియేషన్ మాజీ సెక్రటరీ ఉరెన్ హక్, వీవీఆర్ఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మ్యాచ్ అనంతరం జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి షేక్ హసన్ రాజా, మెంటార్ ఇలియాస్ మహ్మద్ మాట్లాడుతూ గత సీజన్‌లో జిల్లా నుంచి రంజీ క్రికెటర్లతో కలిపి మొత్తం 9 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఏసీఏ ఆంధ్రా జట్లకు ప్రాతినిధ్యం వహించిన విషయాన్ని గుర్తుచేశారు. రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు సహకారంతో క్రికెట్ అభివృద్ధికి అనేక ప్రణాళికలు తయారు చేస్తున్నామని వివరించారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ సహకారంతో క్రికెట్ నెట్స్‌వద్ద ఫ్లడ్‌లైట్లు, అధునాతన నెట్‌లను కూడా ఏర్పాటు చేసినట్టు హసన్‌రాజా, మెంటార్ ఇలియాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురిని సత్కరించారు.

అందరికీ అయోధ్య అక్షతలు


నగరంలో అక్షతల పంపిణీ

శ్రీకాకుళం కల్చరల్: రామజన్మభూమి అయోధ్యలో భవ్య మందిర ప్రతిష్టాపన మహోత్సవాలలో భాగంగా.. రాముడి అక్షతలను ఊరూరా పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని విశ్వహిందూ పరిషత్ ప్రణాళిక ప్రకారం ఈ పంపకం చేస్తున్నారు. నవంబరు నెలలో బాలరామునికి అర్చన చేసిన అక్షింతలు అయోధ్య నుంచి జిల్లాకు రాగా వాటిని శ్రీకాకుళంలోని బలగ నాగావళి తీరంలో ఉన్న బాలత్రిపుర కాలభైరవ పీఠానికి చేర్చారు. అక్కడి నుంచి ప్రతి గ్రామానికి అందజేస్తున్నారు. జిల్లా కేంద్రంగా మండల స్థాయి, మేజర్ పంచాయితీ స్థాయి, పట్టణ స్థాయిని విభజించి జిల్లాలోని 30 మండలాలకు, మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ ఉన్న దేవాలయాలకు చేర్చారు. వీటిని అందజేయడంలో భజరంగదళ్, దుర్గా వాహిని, సంఘ వివిధ క్షేత్రాలు, దేవాలయ కమిటీలు, వివిధ ధార్మిక సంఘాలు, భజన బృందాలు, అర్చక, పురోహితులు, యువజన సంఘాలు, యువతి, యువకులు ఈ మహాకార్యంలో భాగస్వాములయ్యారు.

5 లక్షల గృహాలకు అందజేత

జనవరి 1వ తేదీ నుంచి ఇంటింటికీ పంపిణీ మొదలుపెట్టారు. ఇప్పటి వరకు 5లక్షల గృహాలకు అక్షతలను విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు అందజేశారని నిర్వాహకులు చెబుతున్నారు. మిగిలిన వాటిని కూడా అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్షతలతో పాటు, అయోధ్య రామాలయ చిత్రపటం, ఆహ్వాన కరపత్రం అందజేస్తున్నారు.

ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు

రామమందిర ప్రతిష్టాపనకు అందరూ వెళ్లే వీలు లేని నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని టెలివిజన్, డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు ద్వారా వీక్షించడానికి గాను ఎక్కడికక్కడ దేవాలయాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా టెక్కలి యోగా కేంద్రంలో, ఆమదాలవలస వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే దూరదర్శన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం, తదితర ప్రైవేటు చానల్స్ ప్రసారం కూడా ఉంటుంది.

జిల్లా స్థాయి క్విజ్ విజేత కాశీబుగ్గ


కాశీబుగ్గ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న గ్రామస్తులు, సంఘ ప్రతినిధులు

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ చినమామిడిపల్లి గ్రామంలో మహాసేన యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. చినమామిడిపల్లి గ్రామంలో ఆదివారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 60 టీమ్‌లు పాల్గొన్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు వరుసగా కాశీబుగ్గ ఉన్నత పాఠశాల, కొత్తపల్లి ఉన్నత పాఠశాల, హరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు గెలుచుకున్నారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు బహుమతులు అందజేశారు. పది స్థానాలు లోపు సాధించిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాదవరావు,గ్రామస్తులు రెయ్యి కోదండ కృష్ణ,దున్న కృష్ణారావు, సంఘ సభ్యులు మురళి, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

మంచు సిత్రాలు..!

పొగమంచు కమ్మేస్తోంది. ఎన్నడూ లేనంత దట్టంగా మంచు కురుస్తోంది. దీంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం ఏడెనిమిది గంటలైనా మంచు తెరలు తొలగకపోవడంతో లైట్లు వేసుకుని మరీ రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. శనివారం వేకువజామున కొత్తరోడ్డు హైవే, పరిసర ప్రాంతాల్లో మంచు దృశ్యాలు ఇక్కడ చూడొచ్చు.

– శ్రీకాకుళం క్రైమ్


లైట్లు వేసుకుంటూ వస్తున్న వాహనాలు


ఆహారం కోసం పక్షుల పరుగులు


హైవేలో మంచుతెరల వెలుగుజిలుగులు

క్లుప్తంగా

ఎన్నేళ్లకెన్నేళ్లకు..


అప్పటి హెచ్‌ఎం నీలాంద్రిరావును సన్మానిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 లో టెన్త్ చదివిన వారు ఆదివారం ఆత్మీయంగా కలిశారు. పలు ప్రాంతాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు సంక్రాంతి సందర్భంగా గ్రామాలకు చేరుకుని నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి హెచ్‌ఎం ఎం.నీలాంద్రిరావు, ఉపాధ్యాయులు ముంగుపుడి శ్రీనివాసరావు, లలితకుమారి, రుక్మిణీదేవి, చంద్రయ్య, సన్యాసి నాయుడు, చంద్రయ్యలను సన్మానించారు.

కొంగరాం వ్యక్తి శబరిమలైలో అదృశ్యం


గుండ ఈశ్వరుడు

ఎచ్చెర్ల క్యాంపస్: కొంగరాంకు చెందిన గుండ ఈశ్వరుడు స్థానికులతో కలిసి శబరమలై అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. ఈ గ్రామం నుంచి 20 మంది వెళ్లారు. ఈ నెల 11 నుంచి ఈయన కనిపించడం లేదు. తోటి భక్తులు వెతుకుతున్నా ఈయన జాడ కనిపించడం లేదు. అక్కడి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేశారు. కుమారుడు సైతం అక్కడకు వెళ్లారు.

కూల్‌డ్రింక్ అనుకుని, పురుగుమందు తాగిన విద్యార్థి

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- బొడ్డగూడ గ్రామంలో విషాదం


బినయం(ఫైల్)

భామిని: కూల్‌డ్రింక్ అనుకుని, పురుగు మందు తాగి బిడ్డిక బినయం(12) అనే విద్యార్థి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని బొడ్డగూడ గిరిజన గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. భామిని గిరిజన సంక్షేమ గురుకు ల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న బినయం సంక్రాంతి సెలవులకు గ్రామంలోని ఇంటికి వెళ్లాడు. ఇంటి పెరటిలోని పశువుల శాలలో దాచిపెట్టిన టిలో(డ్రింక్ బాటిల్)లో రైతు పురుగుమందు నిల్వ చేశాడు. అదే శాలకు ఉదయం వెళ్లిన సదరు విద్యార్థి ఆ బాటిల్‌ను చూసి, డ్రింక్ అనుకుని తాగేశాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురి కాగా, వైద్య సేవల నిమిత్తం 108 అంబులెన్స్‌లో భామిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం ఉన్నత వైద్యం కోసం సీతంపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడే వైద్యం అందిస్తుండగా, మరణించాడు. పండగ పూట కొడుకు మరణంతో బాధి త తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థి తల్లి సరోజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిట్టిపోలు ప్రసాద్ తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

సంతకవిటి: శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో గాడి తిరుపతిరావు(60)అనే వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏఎస్‌ఐ ఎం.వాసుదేవరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మద్యానికి బానిస అయిన అతడిని ఇలా తాగితే మనమెలా బతుకుతామని కూతురు మందలించడంతో ఈ నెల 12వ తేదీన అతడు పురుగుమందు తాగాడు. ఇదే విషయాన్ని అతడు మరుసటిరోజు ఉదయం ఇంట్లో వారికి చెప్పడంతో వారు చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఉదయం చనిపోయాడు. మృతుడికి భార్య సుజాత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.